కథానిక

# మతావేశం

శ్రీ బలిజేపల్లి రాఘవరావు

అది మొగలాయీ చక్రవర్తులలో నగ్రగణ్యుడగు అక్బరు చక్రవర్తి పరిపాలనాకాలం. అక్బరు మతాంతర సహనము జూపి, తాను రాజపుత్ర స్త్రీలను వివాహమాడుట, రసపుత్ర వీరులకు పెద్ద పెద్ద యుద్యోగము లిచ్చుట మొదలగు పనులతోటి మహమ్మదీయులకు, ముఖ్యంగా మహమ్మదీయ సర్దారులకు యిష్టం లేదు. ఐనను వారికంటె యున్నత పదవులలో నున్న రసపుత్రవీరులకు వారు తల యొగ్గక తప్పిందికాదు.

అట్టివారిలో ముర్తాజ్ ఒకడు. ముర్తాజ్ పరమ ఛాందసుడు. అక్బరు ప్రవర్తన ముర్తాజ్ కేమీ నచ్చదు. ముర్తాజ్ అక్బరు ఆస్థానంలో నొకకవి. అతడెలాగైనా అక్బరనుసరించుచున్న విధానాన్ని మార్చాలని ప్రయత్నిస్తూ వుండేవాడు. కాని అక్బరతని బోధనలను వినకుండా త్రోసిపుచ్చుతూవుండేవాడు. ముర్తాజ్‌కు రషీదా యను నొక కుమార్తె వుండేది. ఆమె కూడా ముర్తాజ్ మనస్సు మార్చాలని ప్రయత్నించి, చివరకాయత్నం ఫలించక తన ప్రయత్నాలను మానుకుంటుంది.

ఒకనాడక్బరు కొలువుదీరి వుంటాడు. అతని యాస్థానమందు బీర్బల్, మాన్‌సింగ్, తోడర్‌మాల్ మొదలుగాగల రసపుత్ర వీరులంతా ఉన్నతాసనములపై కూర్చుంటారు. ముర్తాజ్ మొదలుగాగల మహమ్మదీయ మతాభిమానులు కూడ నొక ప్రక్క కూర్చుంటారు. అక్బరు కావ్య గోష్టి జరుపుతూ తాను క్రొత్తగా సృజించిన మతమగు "దిన్ ఇలాహీ" దాని మూలమంత్రమగు "అల్లాహో అక్బర్" గురించి ఉపన్యసిస్తూ వుంటాడు. ముర్తాజ్‌కు యీ పిచ్చి పిచ్చి వుపన్యాసాలతో పిచ్చెత్తినట్లైంది. వెంటనే యతడు లేచి మహమ్మదీయ మతమునకు సాటియైన మత మీ ప్రపంచమందు మరొకటి లేదనియు, దానిముందీ హిందూ మత మొక తృణప్రాయ మైనదనియు మహావేశముతో నుపన్యసిస్తూ వుంటాడు. అంతటితో నూరుకోనక అక్బరును విమర్శిస్తూ మహమ్మదీయ మతమునకు వ్యతిరేకముగా నడచిన వారికి నరకప్రాప్తి యౌనని అంటాడు. అక్బరాతని అవమాన పరచి, కొలువునుండి బయటకు నెట్టివేస్తాడు.

అక్బరుచే నీవిధముగ నవమానితుడైన ముర్తాజ్ అక్బరుపై నెట్లైన పగసాధింపవలెనని చూస్తూవుంటాడు. ఆ కాలములోనే అక్బరు కుమారుడగు సలీము దుర్వ్యసనముల పాలై యక్బరుపై తిరుగుబాటు చేయుటకు యత్నిస్తూ వుంటాడు. ముర్తాజ్ సలీమునకు మంత్రియై యతని నక్బరుపై తిరుగుబాటు చేయవలెనని

బోధిస్తూ వుంటాడు. రషీదా తన తండ్రి నామార్గమునుండి త్రిప్పవలెనని యత్నిస్తూ వుంటుంది. ఒకనాడు రషీదా ముర్తాజ్‌ను తిరిగి అక్బరునే బ్రతిమాలి యతని కొలువులో చేరమని ప్రార్థిస్తుంది. మతావేశములోనుండి కన్నుమిన్ను గానకున్న యాతనికి రషీదా మాటలు చెవిని సోకలేదు. పైగానాతడక్బరును హత్యచేసి తీరుతానని ప్రతిజ్ఞచేస్తాడు. ఆ మాటలువిన్న రషీదా తన తండ్రి మతావేశంతో అక్బరును హత్యచేయునేమో యను భయముతో నాతనిని రక్షించుటకు మగవేషధారిణియై, అక్బరు అంగరక్షకులలో నొకరుగా చేరుతుంది.

సలీము సర్వ ప్రయత్నములుజేసి తండ్రిని కైదుచేయుటకు సిద్ధపడతాడు. కాని సేనాపతియగు మాన్‌సింగు సలీము నోడించి తరిమివేస్తాడు. సలీము పారిపోయిన సంగతి విగానే ముర్తాజ్‌కూడాపారిపోతాడు. మాన్‌సింగు కల్లోలములనణచి రాజ్యములో శాంతి భద్రతలు నెలకొల్పుతాడు.

పారిపోయిన ముర్తాజ్ అంతటితో తన యుద్రేకము విడువక అక్బరును హత్యచేయుటకై సమయమునకై నిరీక్షిస్తూ వుంటాడు. ఒకనాటిరాత్రి సౌధోపరిభాగమందు వెన్నెలలో అక్బరిటునటు పచార్లు చేస్తూ వుంటాడు. అది జ్యేష్ఠమాస మగుటచే ప్రజలు నిద్రకై యత్నిస్తూ తమ తమ ప్రక్కలపై నిటునటు దొర్లుతుంటారు. కోటదేవిడీయొద్ద పండ్రెండు గంటలు కొట్టిరి. అక్బరింకా పచార్లు చేస్తూనే వున్నాడు. ఇంతలో చేతనొక బాకు పట్టుకొని మెల్లగా ముర్తాజ్ ప్రత్యక్షమౌతాడు. అక్బరింకా యతనిని చూడలేదు. ముర్తాజ్ అక్బరును చిత్రవధ చేయ యత్నిస్తూంటాడు. అక్బరు పరాకుగానతనినిజూచి భయపడ్డాడు. పరాకుగా, నిస్సహాయ స్థితిలోనున్న యక్బరేమిచేయగలడు? ఇంతలో అక్బరు అంగరక్షకుని వేషములోనున్న రషీదా యచ్చటికివచ్చి నిలుస్తుంది. ముర్తాజ్ తడబడుతూ తన చేతిలోని బాకు అక్బరుపైకి విసురుతాడు. రషీదా అక్బరున కడ్డునిలచి బాకుపోటు వలన నేలకొరగిపోతుంది. అక్బరు ముర్తాజ్‌ను కైదుచేయిస్తాడు.

అక్బరు ముర్తాజ్‌కు మరణశిక్ష విధిస్తాడు. గాయపుబాధతోనున్న రషీదా తన తండ్రి వృత్తాంతము, తన వృత్తాంతము చెప్పి, తన తండ్రిని కాపాడమని ప్రార్థిస్తుంది. ఇదియే తన యంతిమ కోర్కె యనిచెప్పి యామె మరణిస్తుంది. తన ప్రాణములను రక్షించుటకు ప్రాణములను కోల్పోయిన యావనిత వృత్తాంతమును వినుసరికి అక్బరు హృదయం కరిగిపోతుంది. అక్బరు ముర్తాజ్‌ను విడిచి పెడ్తాడు. ముర్తాజ్ తన తప్పులను క్షమించమని ప్రార్థించి తన మతావేశంవల్లనే యిదంతా జరిగిందని తలచి తనుకూడా అక్బరు మతము ననుసరిస్తాడు. అక్బరు రషీదా జ్ఞాపకార్థం ఒక సమాధి నిర్మించాడు.